సాక్షి
బాపట్ల
గురువారం । 28 । నవంబర్ । 2024



ఎస్‌బీఐ వితరణ

మంగళగిరి: వీవర్స్ కాలనీలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఎస్‌బీఐ తరఫున రూ.5 లక్షల విలువైన సామగ్రి అందించారు. జీఎం శైలేష్‌కుమార్ పాల్గొన్నారు.



అమ్మవారికి జ్వాలా కిరీటం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెం మహంకాళికి దరియావలి, నాగమణి దంపతులు రూ.2 లక్షల విలువైన పంచ శిరస్సుల నాగాభరణ జ్వాలా కిరీటం అందించారు.


ఏకాదశ రుద్రాభిషేకం



రేపల్లె రూరల్: ఇసుకపల్లిలోని భ్రమరాంబ సమేత చెన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం, బిల్వ పత్రాలతో అభిషేకం నిర్వహించారు. స్వామి వారిని పట్టువస్త్రాలతో అలంకరించారు.

న్యూస్‌రీల్

సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ చాంపియన్ నంద



సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన న్యాయవాది పర్చూరు నంద సీనియర్ మహిళా విభాగం 76 కేజీల విభాగంలో 297.5 కేజీల బరువును ఎత్తి సౌత్ ఇండియా చాంపియన్‌గా నిలిచారు. తమిళనాడులోని సేలంలో ఈ నెల 22, 23, 24 తేదీల్లో సీనియర్, సబ్ జూనియర్, జూనియర్ ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఇందులో నంద ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతాకాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా ఆమెను గ్రామస్తులు అభినందించారు.

అమరేశ్వరునికి లక్ష బిల్వార్చన



అమరావతి: ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్థిల్లాలని అమరావతి అమరేశ్వరాలయంలో బుధవారం లక్షబిల్వార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితులు తొలుత మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. ఆలయ అర్చకులు స్వామివారికి విశేష అలంకరణ చేసి సహస్ర నామాలతో వేడుక జరిపారు. బాల చాముండికా అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఫ్లాగ్ డేకు విరాళాలు అందజేయండి



నరసరావుపేట: దేశ రక్షణలో అమరులైన సైనికుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రజలు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు విరివిగా విరాళాలు అందజేయాలని జిల్లా సైనిక సంక్షేమాధికారి గుణశీల కోరారు. సాయుధ దళారులు, మాజీ సైనికులు, వితంతువుల సంక్షేమం కోసం డిసెంబరు 7వ తేదీన నిర్వహించే ఫ్లాగ డేను పురస్కరించుకొని బుధవారం తన క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పోస్టర్, కార్ ఫ్లాగ్స్, పతాక స్టిక్కర్లను ఆవిష్కరించారు. విరాళాలు అందించే వారు 'డైరక్టర్, సైనిక సంక్షేమశాఖ, మొఘల్రాజపురం, విజయవాడ'కు ఆన్‌లైన్ ద్వారా ఎస్‌బీఐ, ఎంజీరోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ, కరెంటు అకౌంట్ నం.33881128795, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్0016857, ఎంఐసీఆర్ నం. 520002046 ద్వారా గానీ, డైరెక్టర్, సైనిక్ వెల్ఫేర్, విజయవాడ పేరిట చెక్కు ద్వారా గుంటూరు హిందూ కళాశాల ఎదురుగా ఉన్న జిల్లా సైనిక సంక్షేమాధికారికి పంపాలని గుణశీల కోరారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): బాల్య వివాహాలను అరికట్టడం వల్ల దేశం అభివృద్ధివైపు పయనిస్తుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి పార్థసారథి చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, క్రాఫ్ట్, ఎన్జీవో సంయుక్తంగా జిల్లా కోర్టు ఆవరణలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో బుధవారం బాల్య వివాహ వ్యతిరేక వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జిల్లాను బాల్య వివాహరహితంగా చేయాలని తీర్మానించి, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి టి.లీలావతి, నాలుగో అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎం.కుమిదిని, ఒకటో అదనపు సీనియర్ సివిల్ జడ్జి వై.గోపాలకృష్ణ, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ పిడి విజయకుమార్, రాష్ట్ర సమన్వయకర్త జి.తిరుపతిరావు, ఐసీడీఎస్ నోడల్ అధికారిణి శ్రీవాణి, క్రాఫ్ట్ జిల్లా కో-ఆర్డినేషర్ కె.సమీర్, వెంకయ్య, ప్యానెల్ లాయర్స్, పారా లీగల్ వలంటీర్స్, చైల్డ్ వెల్ఫేర్ పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చ బెదిరింపులు

చీరాలలో ఇసుక అక్రమ రవాణా

- రేయి, పగలు తేడాలేకుండా ఇసుక తరలిస్తున్న పచ్చనేతలు
- తాగునీటికి ఇబ్బంది పడతామన్న పుల్లరిపాలెం ఎస్టీలు
- అయినా ఆగని రవాణా
- జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేసిన యానాదులు
- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించిన కమిషన్
- విచారణ చేపట్టిన చీరాల ఆర్డీఓ, తహసీల్దారు
- అధికారుల సమక్షంలోనే ఎస్టీలను బెదిరించిన పచ్చనేత అనుచరులు



పుల్లరిపాలెం వద్ద పచ్చనేతల అక్రమ ఇసుక తవ్వకాలు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: ఇసుక, మద్యం బెల్టు షాపుల జోలికెళ్లవద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే చెబుతున్నా పచ్చనేతలు ఏమాత్రం ఖాతరు చేయడంలేదు. నదులు, వంకలు, వాగులు, అసైన్డ్, ప్రభుత్వ, అటవీ భూములు అనే తేడా లేకుండా ఎక్కడ దొరికితే అక్కడ ఇసుక తవ్వి అమ్మకానికి పెట్టి పెద్దఎత్తున దండుకుంటున్నారు. వేమూరు, రేపల్లె నియోజకవర్గాల పరిధిలో కృష్ణానది నుంచి పచ్చనేతలు ఇసుక తరలించి అమ్ముతుండగా బాపట్ల నియోజకవర్గంలోని వెదుళ్లపల్లి, కర్లపాలెం, పిట్టలవానిపాలెం ప్రాంతాల నుంచి, అద్దంకి పరిధిలో గుండ్లకమ్మ నది నుంచి ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. చీరాల పరిధిలోని వేటపాలెం, పర్చూరు పరిధిలోని కడవకుదరు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున ఇసుకను బాపట్ల, ప్రకాశం, పల్నాడు ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు.

చీరాల, పర్చూరు నేతలపై రాష్ట్రస్థాయిలో చర్చ

ప్రధానంగా చీరాల, పర్చూరు పచ్చనేతలు అక్రమార్జనే ధ్యేయంగా ఇసుకను కొల్లగొడుతున్నారు. తాజాగా చీరాల నియోజకవర్గంలో పచ్చనేతల ఇసుక అక్రమ తరలింపు వ్యవహారం రాష్ట్రస్థాయిలో చర్చకు దారితీసింది.

ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

వేటపాలెం మండలం పుల్లరిపాలెం సాయి ఎస్టీ కాలనీ సమీపంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని, దీంతో భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి ఇబ్బందులు పడుతున్నామని, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కాలనీ ఎస్టీలు జాతీయ ఎస్టీ కమిషన్‌కు గత నెలలో ఫిర్యాదు చేశారు. అంతకు ముందు వారు జిల్లా అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఎస్టీల వినతిపై స్పందించిన జాతీయ ఎస్టీ కమీషన్ ఫిర్యాదుపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర చీఫ్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్‌లకు లేఖ పంపింది. ఉన్నతాధికారులు ఈనెల 23న చీరాల ఆర్డీవో, వేటపాలెం తహసీల్దారులను విచారణకు పంపింది.

ఎస్టీలకు తాగునీటి కష్టాలు

వాస్తవానికి సాయి ఎస్టీకాలనీ ప్రజలు తాగునీటి కోసం ఇప్పటికే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ పరిసర ప్రాంతాల్లో పెద్దఎత్తున రొయ్యల చెరువులు ఉండడంతో పొల్యూషన్ పెరిగింది. వ్యర్థాలు భూమిలోకి ఇంకి భూగర్భ జలం ఉప్పగా మారింది. తాగునీటితోపాటు ఇతర అవసరాలకు ఆ నీటిని వాడుకొనే పరిస్థితి లేదు. తాగునీరు అందుబాటులో లేకపోవడంతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. వేసవిలో నీటి ఇబ్బందులు తలెత్తే అవకాశముంది. పచ్చనేతలు మాత్రం ఇప్పటికీ ఇసుకను తరలిస్తూనే ఉన్నారు. మరి విచారణ చేసిన అధికారులు నిజాయితీగా ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకుంటారా? లేదా ? అనేది చూడాలి. అధికారులు స్పందించకపోతే మరో మారు ఎస్టీ కమిషన్‌ను సంప్రదించేందుకు యానాదులు సిద్ధంగా ఉన్నారు.

అధికారుల అండదండలతో పచ్చనేతల బరి తెగింపు

అధికారులతోపాటు ఇసుకను అక్రమంగా కొల్లగొడుతున్న పచ్చనేతలు విచారణకు వెళ్లడం గమనార్హం. అధికారులే పచ్చనేతలను విచారణకు తీసుకెళ్లారా? లేక వారే వెళ్లారా అనేది ప్రశ్న. అధికారులతోపాటు విచారణకు హాజరైన పచ్చనేతలు ఆర్డీఓ, తహసీల్దారులను మాట్లాడనివ్వకుండా ఎస్టీలపై దౌర్జన్య పూరితంగా వ్యవహరించారు. ఇసుక అక్రమాలపై ఫిర్యాదులు చేస్తారా? సంతకాలు పెట్టింది ఎవరు? మీరేనా? అంటూ ఎస్టీలను బెదిరించి భయభ్రాంతులకు గురిచేయడం మరింత చర్చనీయాంశంగా మారింది. పచ్చనేతలు ఎస్టీలను బెదిరిస్తున్నా అధికారులు నిస్సహాయులుగా ఉండిపోయారు. దీనిపై ఎస్టీ కాలనీ వాసులు జిల్లా, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. పచ్చనేతల వల్ల తమకు ప్రాణహాని ఉందని ఎస్టీ హక్కుల పరిరక్షణ సంఘం అధికారులకు ఫిర్యాదు చేసింది.



ఎస్టీలను బెదిరిస్తున్న పచ్చనేతలు


సీఎం పర్యటనపై అశ్రద్ధ వద్దు

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



బాపట్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనను జయప్రదం చేయడానికి అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. డిసెంబర్ 7న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనపై జిల్లా అధికారులతో స్థానిక బాపట్ల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ముందస్తు ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌ను గొప్పగా నిర్వహించాలని చెప్పారు. జిల్లాలోని 1,431 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ సమావేశాలు జరపాలన్నారు. అతిథులంతా ఒకేచోట లేకుండా ప్రతి పాఠశాలలో స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం 912 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. పాఠశాలలో చదువుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో వసతి పొందుతున్న విద్యార్థులను ప్రత్యేకంగా గుర్తించి వారి తల్లిదండ్రులకు కూడా ఆహ్వానం పంపాలని తెలిపారు. పట్టణంలో ఉండే విద్యార్థుల తల్లిదండ్రులకు ఘనంగా ఆహ్వానం పంపాలని, దీనికి సచివాలయాల సిబ్బంది సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఇందుకోసం ఆహ్వాన కమిటీ ఏర్పాటు చేశామని, కమిటీకి కోఆర్డినేటర్‌గా రేపల్లె ఆర్డీఓ వ్యవహరిస్తారన్నారు. ఉన్నత స్థాయికి ఎదిగిన పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. విద్యార్థుల ప్రోగ్రెస్‌పై సమీక్షించేందుకు విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ చెప్పారు. వివిధ శాఖల అధికారులకు పలు బాధ్యతలు అప్పగించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, ఆర్డీవోలు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ లిఫ్టర్ రేణుకకు బంగారు పతకం



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరుగుతున్న సౌత్, వెస్ట్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో బుధవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వెయిట్ లిఫ్టర్ రేణుక బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నారు. మహిళల 76 కేజీల కేటగిరీలో మొత్తం 205 కేజీల బరువు ఎత్తిన రేణుక ప్రథమ స్థానంలో నిలిచారు. పోటీల వివరాలను ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య పీపీఎస్ పాల్‌కుమార్ వెల్లడించారు. వీసీ ఆచార్య గంగాధరరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం పోటీలను పర్యవేక్షించి వెయిట్ లిఫ్టర్లను అభినందించారు. టెక్నికల్ టీం చీఫ్ బడేటి వెంకట్రామయ్య, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధ్యాపకులు డాక్టర్ డి.సూర్యనారాయణ, డాక్టర్ ఇన్నయ్య, డాక్టర్ రామ్మోహనరావు పాల్గొన్నారు.

పలు విభాగాల్లో వరుస మూడు స్థానాల్లో నిలిచిన విజేతలు ఇలా..

71 కేజీల కేటగిరీ: సనపత్తి పల్లవి (ఆంధ్ర యూనివర్సిటీ), బి. నాని (ఆచార్య నాగార్జున యూనివర్సిటీ), ఎం తనూష (మంగుళూరు యూనివర్సిటీ).
64 కేజీల కేటగిరీ: కామ్ బ్లీ హిమాలి నగేష్(భారతీ విద్యాపీఠల్ యూనివర్సిటీ), మోహితే భూమిక రాజేంద్ర (శివాజీ యూనివర్సిటీ), వెండి పతకాన్ని, కౌశికల్ (అన్నామలై యూనివర్సిటీ).
59 కేజీల కేటగిరీ: సాక్షి రమాలే (భారతీ విద్యాపీ ఠ్ యూనివర్సిటీ), కనికశ్రీ వీఆర్ (భారతీయార్ యూనివర్సిటీ, కందుకూరి హైమావతి (జేఎన్‌టీయూ కాకినాడ).

విరుల తోటల్లో 'సిరి'గమలు

- బాపట్ల ప్రాంతంలో రెండు వేల ఎకరాల్లో పూలతోటల సాగు
- 25 రకాల పూలను సాగుచేస్తున్న రైతులు
- వైఎస్సార్ పుణ్యమాని ఉచిత విద్యుత్ సరఫరా
- వెదుళ్లపల్లి నుంచి పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి
- కార్తిక మాసంలో పూలకు పెరిగిన డిమాండ్
- పూల తోటలతో వేలమందికి ఉపాధి



వెదుళ్లపల్లిలో సాగులో ఉన్న బంతిపూల తోటలు



వైఎస్సార్‌నగర్‌లో సాగులో ఉన్న విరజాజి తోట



బేతపూడిలో సాగులో ఉన్న చామంతిపూల తోట

బాపట్ల టౌన్: జిల్లాలోని బాపట్ల, చీరాల మార్గం మధ్యలో ఏ గ్రామానికి వెళ్లినా రంగురంగుల పూల తోటలతో ఆయా గ్రామాలు అందంగా కనిపించడమే కాకుండా సువాసనలు వెదజల్లుతుంటాయి. తరతరాలుగా పూలసాగునే నమ్ముకొని రైతులు జీవిస్తున్నారు. ఏఏ సీజన్‌లో ఏఏ రకాల పూలకు డిమాండ్ ఉంటుందో...ఏఏ రకాల పూలు సాగుకు అనుకూలంగా ఉంటుందో ముందుగానే తెలుసుకొని వాటి డిమాండ్‌కు అనుగుణంగా సాగుచేయటం ఆయా గ్రామాల రైతుల ప్రత్యేకత.
మండలంలోని వెదుళ్లపల్లి, బేతపూడి, మహాత్మాజీపురం, కుక్కలవానిపాలెం, కొత్తపాలెం, తులసీనగర్, వృక్షనగర్, మహాత్మాజీపురం, మరుప్రోలు వారిపాలెం, పోతురాజుకొత్తపాలెం, వైఎస్సార్ నగర్, సుబ్బారెడ్డిపాలెం, మున్నంవారిపాలెం, దరివాదకొత్తపాలెం, ఉప్పరపాలెం, పట్టణంలోని చిల్లరగొల్లపాలెం గ్రామాల్లోని ప్రజలకు పూలసాగే జీవనాధారం. ఆయా గ్రామాల్లో ఒక్కో గ్రామానికి 300 నుంచి 600 వరకు కుటుంబాలు ఉంటాయి. కుటుంబం కనిష్టంగా 15 సెంట్ల నుంచి గరిష్టంగా రెండు ఎకరాల వరకు పూల తోటలను సాగు చేస్తుంది. అన్ని గ్రామాల్లో కలిపి సుమారు 2000 ఎకరాల మేరా పూలతోటలు సాగు చేస్తుంటారు.

కార్తిక మాసంలో పెరిగిన డిమాండ్

కార్తిక మాసంలో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని ప్రతి ఒక్కరూ పూలకోసం వెదుళ్లపల్లి పూలమార్కెట్ రావాల్సిందే. రెండు జిల్లాల తోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు ప్రతిరోజు బస్సు, లారీల మార్గాన టన్నుల కొద్దీ పూలు ఎగుమతి చేస్తుంటారు. కార్తిక మాసంలో దీక్షాపరులు పూలను విరివిగా ఉపయోగిస్తుంటారు. భజనలకు అవసరమైన పూలకోసం వెదుళ్లపల్లి మార్కెట్‌కు అధికసంఖ్యలో చేరుకుంటుంటారు. కార్తిక మాసంలో పూలమార్కెట్ ఎప్పుడు చూసినా రద్దీతో కళకళలాడుతుంటుంది.



మహాత్మాజీపురంలో సాగులో ఉన్న కనకాంబరం తోట

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

బాపట్ల పరిసర ప్రాంతాల్లో మల్లెపూలు, జాజి, బంతి, గులాబి, నాటు గులాబి, ఐదు రకాల చామంతి పూలు, కనకాంబరాలు, కాగడాలు, లిల్లీ పూలతోపాటు పూలమధ్యలో ఉపయోగించే లైన్‌ఆకు, తులసి, మరువం ఆకులను కూడా విస్తృతంగా పండిస్తారు. ఈ విధంగా సాగుచేసిన పూలను చుట్టుపక్కల గ్రామాల నుంచి వెదుళ్లపల్లి పూలమార్కెట్‌కు తరలిస్తారు. అక్కడివచ్చిన వ్యాపారస్తులు ఇక్కడి పూలను కొనుగోలు చేసుకొని రాష్ట్రంలోని తిరుపతి, విజయవాడ, కడప, నెల్లూరు జిల్లాలతోపాటు పొరుగు రాష్ట్రాలైన తెలంగాణ, చెన్నైకు ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడ సాగుచేసే పూలసాగు వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 15 వేల మందికి ఉపాధి దొరుకుతుంది.

వైఎస్సార్ పుణ్యమే ..

2004 ముందు ఆయా గ్రామాల్లోని పొలాలు కాకులు దూరని కారడవి...చీమలు దూరని చిట్టెడవి తలపించేలా ఉండేవి. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి సీఎం అయిన తర్వాత ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్ పథకంతో ఆయా ప్రాంతాల్లోని సన్న,చిన్నకారు రైతులంతా వారికున్న పొలాల్లో పూల తోటల సాగుకు శ్రీకారం చుట్టారు. గతంలో దొరువులు వేసుకొని బుంగలతో నీళ్ళు చల్లుకుంటూ అతి తక్కువ సంఖ్యలో సాగుచేసేవారు. ఉచిత పథకం ప్రవేశపెట్టిన తర్వాత ఆయా గ్రామాల్లో చూద్దామన్నా దొరువులు కనిపించడం లేదు. ఊరంతా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేసుకొని, బోర్ల సహాయంతో ఏడాదిలో మూడు నుంచి నాలుగు పంటలు పండిస్తున్నారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో ఎప్పుడు పర్యటించినా పరిమళాలు వెదజల్లే పూలతోటలే దర్శనమిస్తాయి.

ఓటర్ల జాబితాలో తేడా అధికంగా ఉంటే చర్యలు

మహిళా, శిశు సంక్షేమ, వృద్ధుల సంక్షేమ శాఖల కార్యదర్శి ఏ.సూర్యకుమారి

బాపట్ల: ఓటర్ల జాబితాలో లింగ నిష్పత్తి తేడా అధికంగా ఉంటే సహించేది లేదని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, వృద్ధుల సంక్షేమ శాఖల ప్రభుత్వం కార్యదర్శి, రోల్ అబ్జర్వర్ ఏ. సూర్యకుమారి తెలిపారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాపై ఈఆర్ఓలు, ఏఈఆర్వోలతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆమె సమావేశం నిర్వహించారు. పర్చూరు, చీరాలలో నియోజకవర్గాలలో లింగ నిష్పత్తి సరిగా లేకపోవడంపై అధికారులను నిలదీశారు. చీరాల, వేమూరు నియోజకవర్గాలలోని బీఎల్‌వోలు సరిగా పనిచేయడం లేదని గుర్తించామని, అధికారులు నిర్లిప్తంగా ఉంటే కుదరదని తెలిపారు. గైర్హాజరైన పర్చూరు ఈఆర్‌ఓకు మెమో జారీ చేయాలని ఆదేశించారు. మృతుల ఓట్లు తొలగింపు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించే బాధ్యత అధికారులపై ఉందని ఆమె స్పష్టం చేశారు. కొత్త ఓటర్లను చేర్పించడం కోసం అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యకుమారి

సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాకు 2.73 లక్షల దరఖాస్తులు వచ్చాయని, తక్షణమే వాటిని గడువులోగా పరిష్కరించాలని తెలిపారు. ఆధార్ అనుసంధానం ప్రక్రియ కేవలం 84 శాతం ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ జరగాలంటే ప్రతి ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలని ఆదేశించారు.
గడిచిన ఎనిమిది నెలల్లో 3,163 మంది ఓటర్లు వలసలు వెళ్లడంపై ఆరా తీశారు. జనవరిలో సవరణ ఓటర్ల జాబితా విడుదల చేస్తామని తెలిపారు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరిస్తున్నామని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. మృతుల ఓటర్లపై విచారణ జరిపి తొలగిస్తామని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.3.80 కోట్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైఉన్న దుర్గమ్మకు భక్తులు హుండీల ద్వారా రూ.3.80 కోట్ల నగదును కానుకలు, మొక్కుబడులు, ముడుపుల రూపంలో సమర్పించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడులను బుధవారం మహా మండపం ఆరో అంతస్తులో లెక్కించారు. రూ.3,80,77,021 నగదుతో పాటు 559 గ్రాముల బంగారం, 7.020 కిలోల వెండి లభ్యమైనట్లు ఆలయ ఈఓ కె.ఎస్.రామారావు తెలిపారు. 615 యూఎస్ఏ డాలర్లు, 55 ఆస్ట్రేలియా డాలర్లు, 27 కత్తార్ రియాల్స్, 110 యూఏఈ దిర్హమ్స్, 33 మలేషియా రింగేట్లు, 30 ఇంగ్లాండ్ పౌండ్లు, 25 కెనడా డాలర్లు, పది సింగపూర్ డాలర్లు లభించాయి. కానుకల లెక్కింపును ఈఓ రామారావుతో పాటు డీఈఓ రత్నరాజు పర్యవేక్షించారు. దేవదాయ శాఖ అధికారులు, ఏఈఓలు, సూపరింటెండెంట్లతో పాటు ఆలయ సిబ్బంది, సేవా సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు వేమూరు కాలేజీలో జాబ్ మేళా

వేమూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో ఈ నెల 29న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నైపుణ్య అభివృద్ధి అధికారి ప్రణయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎకారో సాఫ్ట్ సొల్యూషన్స్, కేఎల్ గ్రూపు, మెడ్‌ప్లస్ ఫార్మసీ, ఏయూ బ్యాంక్‌లు హాజరవుతున్నాయని పేర్కొన్నారు. వందకి పైగా ఖాళీలు ఉన్నాయని తెలియజేశారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, డిప్లొమా, బీఎస్సీ, ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ), ఎంఏ, బీఏ, పీజీ చదివిన 18–30 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్, ఆధార్ ఫొటోస్టాట్లు, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆయన సూచించారు.

మృతురాలి కంటి రెటీనాల సేకరణ



అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లికి చెందిన శనగపల్లి సామ్రాజ్యం బుధవారం మృతి చెందింది. ఆమె కోరిక మేరకు కుమారుడు శ్రీనివాస ప్రసాద గుప్తా కళ్లను దానం చేసేందుకు గుంటూరు శంకర్ కంటి ఆసుపత్రిని సంప్రదించారు. ఆసుపత్రి సిబ్బంది వచ్చి కంటి రెటీనాలను సేకరించుకు వెళ్లారు.

నేటి నుంచి రూబీ టోర్నమెంట్, ఎంపికలు



పెదకాకాని: మండల పరిధిలోని వెనిగండ్ల గ్రామంలోని వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి 68వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన అంతర్ జిల్లా రూబీ టోర్నమెంట్, ఎంపికలు నిర్వహిస్తున్నారు. ఈ టోర్నమెంట్‌కు సంబధించిన షెడ్యూల్, ఆహ్వాన పత్రికను బుధవారం అధ్యాపకులు, నిర్వాహకులు ఆవిష్కరించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ అండర్–17 బాలుర పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 186 మంది క్రీడాకారులు హాజరవుతున్నారని నిర్వాహకులు తెలిపారు. పోటీల ప్రారంభోత్సవ సభకు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జిల్లా విద్యాశాఖ అధికారులు హాజరవుతారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్ తిరుపతిరావు తెలిపారు. పోటీలను వ్యాయామ అధ్యాపకుడు పి. మస్తాన్‌రెడ్డి పర్యవేక్షిస్తారని తెలిపారు.

యథేచ్ఛగా తరలిపోతున్న ఇసుక

- కాకులడొంకలో ట్రాక్టర్ల కోలాహలం
- అనుమతులు లేని రీచ్‌లో తవ్వకాలు
- పలు జిల్లాల నుంచి ట్రాక్టర్ల రాక
- ప్రతి నిత్యం 500 ట్రాక్టర్ల ఇసుక బయటకు తరలింపు
- సమాచారంతో రీచ్‌ను పరిశీలించిన ఎస్‌ఐ



భట్టిప్రోలు మండలంలోని పెదలంక గ్రామంలోని కాకులడొంక వద్ద ఇసుక తీసుకువెళ్లేందుకు వచ్చిన ట్రాక్టర్లు

భట్టిప్రోలు: మండలంలోని పెదలంక కాకులడొంక వద్ద కృష్ణా నదిలో ఉచిత ఇసుక కోసం ట్రాక్టర్లు బారులుతీరుతున్నారు. ఈ రీచ్‌కు ఎటువంటి అనుమతులు లేకపోయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రవాణా రేయింబవళ్లు యథేచ్ఛగా కొనసాగుతోంది. బాపట్ల జిల్లా పరిధిలోని భట్టిప్రోలు, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, పిట్టలవానిపాలెం, కర్లపాలెం వరకు ప్రకాశం, కృష్ణా జిల్లాల నుంచి అధిక సంఖ్యలో ట్రాక్టర్లలో ఇక్కడకు వచ్చి ఇసుక తరలించుకుపోతున్నారు. దీంతో ఆ ప్రాంత రైతాంగం గగ్గోలు పెడుతున్నారు. నిత్యం 400 నుంచి 500 ట్రాక్టర్లు బయకు వెళుతున్నాయి. మొదట్లో వెయ్యి ట్రాక్టర్లు వెళ్లిన సందర్భాలు లేకపోలేదు. ఆ తరువాత రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడంతో ఇసుక అక్రమ రవాణాకు క్లెం పడింది. మళ్లీ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అదేమని అడిగే వారు లేకపోవడంతో ట్రాక్టర్‌ను ఆపే పరిస్థితి కనిపించడం లేదు. సొంత అవసరాల కోసం తీసుకెళ్లాల్సిన ఇసుకను అక్రమంగా ట్రాక్టర్ యజమానులు దూరాన్ని బట్టి రూ. 3 వేల నుంచి 5 వేల వరకు, ఇతర జిల్లాలకు ఐతే రూ. 7 వేలు వరకు వసూలు చేస్తున్నారు.

పంట భూములు ఉప్పెత్తిపోయే ప్రమాదం

నదుల్లో ఇసుక తవ్వుకెళ్లమని ప్రభుత్వం చెప్పలేదని, నిబంధనలకు విరుద్ధంగా నదీ తీరం వెంబడి తవ్వడం వల్ల పంట పొలాలకు ముప్పు కలిగే ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. నదికి ఆటుపోట్లు రావడం వల్ల పంట భూములు ఉప్పెత్తిపోయే ప్రమాదం నెలకొందని పేర్కొన్నారు. అంతే కాక పంట పొలాలు కోతకు గురై నదీ గర్భంలో కలిసిపోవడమే కాక బుసక మేట వేస్తోందని తెలిపారు. పెరిగిన ట్రాక్టర్ల రద్దీతో లంక గ్రామాల ప్రజలు రహదారిపై ప్రయాణించడానికి ఏమాత్రం అవకాశం లేకుండా పోయింది. ఎప్పుడు ఏమి జరుగుతుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. కనీసం రహదారిపై ద్విచక్ర వాహనం తప్పుకోవడానికి కూడా అవకాశం లేని విధంగా ట్రాక్టర్లు లంక గ్రామాల రహదారులపై పరుగు తీస్తున్నాయని ఆయా గ్రామాలకు చెందిన వేములపల్లి వీరాంజనేయులు, మల్లిపెద్ది రామలింగేశ్వరరావు, వీరయ్య చౌదరి, కారుమూరు కుటుంబరావు, ఆలూరి బసవయ్య, నన్నెపాముల కోటేశ్వరరావులు ఎస్‌ఐ ఎం. శివయ్యకు తెలిపారు.

పరిస్థితిని సమీక్షించిన ఎస్‌ఐ



రహదారులపై పరుగులు తీస్తున్న ట్రాక్టర్లు

భట్టిప్రోలు ఎస్‌ఐ ఎం. శివయ్యకు బుధవారం స్థానిక లంక గ్రామాలకు చెందిన రైతాంగం తెలియచేయడంతో ఆయన కాకులడొంక వద్దకు వచ్చి పరిస్థితిని పరిశీలించారు. ట్రాక్టర్లను నిలుపుదల చేయించి యజమానుల పేర్లు, సెల్ నంబర్, ఊరు, ట్రాక్టర్ నంబర్లను సేకరించారు.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలి

- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్
- ప్రతి ఒక్కరికీ అండగా ఉంటాం



మాట్లాడుతున్న డాక్టర్ గణేష్

రేపలె రూరల్: పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేసి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవడమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని రేపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఈవూరు గణేష్ చెప్పారు. చెరుకుపల్లి మండలం గుళ్లపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం నగరం మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణస్థాయి నుంచి వైఎస్సార్ సీపీని బలోపేతం చేసేలా ప్రతి నాయకుడు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా సైనికుల్లా పనిచేయాలని తెలిపారు. అధికారం ఉన్నా లేకున్నా పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అన్నివేళలా అండగా ఉంటుందని చెప్పారు. పార్టీ బలోపేతానికి పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడతామని పేర్కొన్నారు. గ్రామస్థాయి, మండలస్థాయి కమిటీలు ఐక్యంగా ఉండి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యకర్తలపై, ప్రజలపై అధికార పార్టీ వేధింపులు, పెడుతున్న అక్రమకేసులను ఎదుర్కొనేందుకు ఉద్యమాలను చేపడతామని హెచ్చరించారు.

పరిశ్రమలపై సమగ్ర సర్వే విజయవంతం చేయాలి

కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బాపట్ల: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ)పై సమగ్ర సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సర్వే నిర్వహణపై బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులకు వీక్షణ సమావేశం ద్వారా ఆయన అవగాహన కల్పించారు. పరిశ్రమలను గుర్తించే కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అత్యాధునికమైన సర్వే సపోర్ట్ యాప్‌లో ఎంఎస్ఎంఈలను నిక్షిప్తం చేయాలని ఆయన సూచించారు. ఈనెల 29 నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీలోపు సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ కనెక్షన్ లను సైతం క్యాటగిరి–1, క్యాటగిరి–2, క్యాటగిరి–3 కింద నిర్ధారించాలని సూచించారు. చిన్న పరిశ్రమలు, వివిధ ఉత్పత్తులు ఉండే వ్యాపారాలను సైతం ఇందులో చేర్చాలని తెలిపారు. సర్వేకి సంబంధించిన వివరాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి జీఎం ఏ. జయలక్ష్మి, ఏపీఐఐసీ డెప్యూటీ జోనల్ మేనేజర్ ఎం. మధు, జోనల్ మేనేజర్ కె. మంగాదేవి, పరిశ్రమల శాఖ ఏడీ ఏ. సుమధురవాణి, ఐపీఓ వి. సురేంద్ర, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఎరువులను మోతాదుకు మించి వాడరాదు



రైతులకు భూసార పరీక్షల సర్టిఫికెట్లను అందజేస్తున్న బాలమురళీధర్ నాయక్

బాపట్ల టౌన్: విచక్షణా రహితంగా ఎరువులను వాడటం వల్ల పెట్టుబడులు పెరిగి దిగుబడులు గణనీయంగా తగ్గుతాయని బాపట్ల ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ ఆర్. బాల మురళీధర్ నాయక్ తెలిపారు. పట్టణంలోని ఏరువాక కేంద్రంలో బుధవారం ఎస్సీ, ఎస్టీ రైతులకు భూసార పరీక్షల సర్టిఫికెట్లను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాపట్ల పరిసరప్రాంతాల్లో సాగు చేస్తున్న వ్యవసాయ భూముల్లో భాస్వరం, పొటాషియం పోషకాలు ఎక్కువగానే ఉన్నాయని చెప్పారు. భూసార పరీక్షల పత్రాల్లో సిఫార్సు చేసిన మోతాదులో ఎరువులు వాడటంతో పెట్టుబడి ఖర్చులు పెరగకుండా ఉంటాయని తెలిపారు. రైతులు కాంప్లెక్స్ ఎరువులు తగ్గించి సూటీ ఎరువులు వాడకం ద్వారా ఖర్చు తగ్గించుకోవచ్చని సూచించారు. భూసారం పెరగడానికి పచ్చి రొట్ట, పశువుల ఎరువులు వాడుకుంటే నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. మోతాదు మించి ఎరువులు వాడటం ద్వారా పంట బాగా ఎదిగి పురుగు,తెగుళ్ల ఎక్కువ వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. ఇటువంటి పరిస్థితులలో కాండం తొలిచే పురుగు, ఆకు ముడత, ఉల్లి కోడు, పాము పొడ తెగులు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ గార్ల కోటేశ్వరరావు, బాపట్ల కోఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.

ఉత్సవాల నిర్వహణకు చేయూత

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాల నిర్వహణలో స్థానిక శ్రీచక్ర సిమెంట్స్ చేయూతనందిస్తోంది. ఉత్సవ ప్రాంగణం చదును చేయడానికి, రోడ్ల గుంతలు పూడ్చడానికి, ఎడ్ల పోటీల కోర్టు బాగుకు 30 టిప్పర్ల దాకా మట్టి తోలించారు. ఎడ్ల పోటీల బహుమతిని కూడా అందిస్తున్నారు. ఉత్సవాలకు వచ్చే ప్రజలకు తాగునీరు ట్యాంకర్ల ద్వారా అందించే ఏర్పాటు చేస్తున్నట్లు యాజమాన్యం తెలిపింది.

ఆటోడ్రైవర్ నిజాయతీ



పర్చూరు (చినగంజాం): హ్యాండ్ బ్యాగ్ పోగొట్టుకున్న మహిళకు ఆటో డ్రైవర్ నిజాయతీగా అప్పగించిన సంఘటన పర్చూరులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. గుంటూరుకు చెందిన మౌనిక స్కూటీపై పర్చూరు మీదుగా ఇంకొల్లు వెళుతోంది. మార్గంమధ్యంలో హ్యాండ్ బ్యాగ్‌ను పోగొట్టుకుంది. అదే దారిలో పర్చూరు నుంచి ఇంకొల్లు వెళుతున్న ఆటో డ్రైవర్ ఆర్వీ రంగ రోడ్డుపై పడి ఉన్న దాన్ని పర్చూరు ఎస్‌ఐ మాల్యాద్రికి అప్పగించాడు. హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న మొబైల్, ఏటీఎం కార్డు ఆధారంగా మహిళను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి హ్యాండ్ బ్యాగ్‌ను అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు. అందులో మొబైల్‌తో పాటు రూ. 3 వేలు నగదు, ఐడీ కార్డు, ఏటీఎం కార్డు, తాళాలు ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోగొట్టుకున్న మౌనిక హ్యాండ్ బ్యాగ్ దొరకడంతో సంతృప్తి చెంది దానిని అప్పగించిన ఆటో డ్రైవర్‌కు ధన్యవాదాలు తెలిపారు. నిజాయతీతో హ్యాండ్ బ్యాగ్‌ను అప్పగించిన ఆటో డ్రైవర్ రంగాను ఎస్‌ఐ మాల్యాద్రి ప్రత్యేకంగా అభినందించారు.

షూటింగ్ బాల్ పోటీల్లో ఐలవరం విద్యార్థుల సత్తా



విద్యార్థులతో హెచ్‌ఎం ఎం. మోహన్‌రావు, ఉపాధ్యాయులు

ఐలవరం(భట్టిప్రోలు): రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు విజయ దుందుభి మోగించారు. అనంతపురంలోని శ్రీ నేతాజీ ఇంగ్లిష్ మీడియం హైస్కూలులో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు 43వ రాష్ట్రస్థాయి అండర్–17, అండర్–19 బాలబాలికల పోటీలు జరిగాయి. రాష్ట్రంలోని 10 జిల్లాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. అండర్–19 బాలుర విభాగంలో బాపట్ల జిల్లా గుంటూరు జిల్లా జట్టుపై 2–0 తేడాతో విజయం సాధించి ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. అండర్–19 బాలికల విభాగంలో బాపట్ల జిల్లా అనంతపురం జిల్లా జట్టుపై 2–0 తేడాతో తృతీయ స్థానం కైవసం చేసుకుంది. ఈ టీమ్‌లలో కె. రోహిత్. పి. పవన్‌కుమార్ రెడ్డి, ఈ. మణికంఠ, జి. జెస్సిక, కె. తన్మయి శ్రీజ, ఎ.జెనిశ్రీ సాయి అపరేశ్వరి, ఐలవరం హైస్కూల్ నుంచి ఆడారు. విజయానికి కారకులైన క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ తుమ్మా శ్రీనివాసరెడ్డిని బుధవారం హెచ్‌ఎం ఎం. మోహన్‌రావు, షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. సురేంద్ర, బదరీనారాయణ, ఉపాధ్యాయులు, అభినందించారు.

విధులతో పాటు ఆటవిడుపూ అవసరం

ఎస్ఈ జి.ఆంజనేయులు



ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగిని సన్మానిస్తున్న అధికారులు

బాపట్ల: నిత్యం విధి నిర్వహణలో తలమునకలయ్యే విద్యుత్ శాఖ ఉద్యోగులు బుధవారం సరదాగా గడిపారు. కుటుంబ సభ్యుల సహా సూర్యలంక తీరాన ఆదర్శనగర్‌లోని నగరవనం పార్కులో కార్తిక వన సమారాధన నిర్వహించారు. సరదా సరదా ఆటపాటలు, సంగీతం, నత్యాలతో గడిపారు. బాపట్ల జిల్లా విద్యుత్ ఎస్ఈ జి. ఆంజనేయులు ఆధ్వర్యంలో ఉద్యోగులంతా చిన్న పిల్లలై అహ్లాదాన్ని పంచుకుని వన భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ ఉద్యోగులకు విధులతోపాటు ఆటవిడుపూ అవసరమని తెలిపారు. వన సమారాధనలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. విద్యుత్ ఉద్యోగులకు ఎప్పుడూ అండగా నిలుస్తానని తెలిపారు. అనంతరం సర్కిల్ పరిధిలో విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన లైన్‌మేన్ వంగపాటి నాగరాజుతో పాటు పలువురిని సన్మానించారు. కార్యక్రమంలో బాపట్ల ఏడీ పి.శ్రీనివాసరావు, పట్టణ ఏఈ సాయి శ్రీనివాస్, రూరల్ ఏఈ కోటేశ్వరరావు, చెరుకుపల్లి ఏఈ పెరుగు శ్రీనివాసరావు, సర్కిల్ పరిధిలో ఏడీలు, ఏఈలు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

రేపు కొమ్మారెడ్డి సాహితీ పురస్కార ఉత్సవం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఐక్య ఉపాధ్యాయ పత్రిక మాజీ ప్రధాన సంపాదకుడు, సాహితీవేత్త కొమ్మారెడ్డి కేశవరెడ్డి సాహితీ పురస్కార ఉత్సవాన్ని ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం పురస్కార ఉత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఈనెల 29న సాయంత్రం 5 గంటలకు బ్రాడీపేట రెండోలైనులోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో కొమ్మారెడ్డి సాహితీ పురస్కారాన్ని ప్రముఖ రచయిత్రి ఓల్గాకు ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ప్రముఖ సాహితీ విమర్శకుడు పాపినేని శివశంకర్, ఉపాధ్యాయులు, సాహిత్య అభిమానులు పాల్గొంటారని తెలిపారు. పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, వై.నాగమణి, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, జి. వెంకటేశ్వరరావు, ఎండీ షకీలాబేగం, కె.రంగారావు, బెల్లంకొండ ప్రసాద్, కె. ప్రేమ్‌కుమార్, కోటిరెడ్డి పాల్గొన్నారు.

ఆవిష్కరణల దిశగా విద్యార్థులు సాగాలి



నరసరావుపేట రూరల్: విద్యార్థులు నూతన ఆవిష్కరణల దిశగా ముందుగా సాగాలని, భవిష్యత్తులో పారిశ్రామికవేత్తలుగా రాణించాలని ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ కేపీ చౌదరి పేర్కొన్నారు. ఏఎం రెడ్డి ఫార్మసీ కళాశాలలో ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్ అనే అంశంపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కేపీ చౌదరి మాట్లాడుతూ.. యువత ఎంఎస్ఎంఈ ద్వారా నూతన పరిశ్రమల స్థాపనకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. విధివిధానాలు, కల్పించే అవకాశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ్ భూషణ్‌రావు, డీన్ డాక్టర్ ఎంఎల్ సురేఖ, కార్యక్రమ కోఆర్డినేటర్లు సీహెచ్ అజయ్‌కుమార్, డాక్టర్ డి.అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో అదనపు డీఎంహెచ్‌ఓ తనిఖీ

మాచవరం: మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అదనపు డీఎంహెచ్‌ఓ పద్మావతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఇక్కడ అందిస్తున్న వైద్య సేవలు, ఆశా వర్కర్లు, సిబ్బంది పని తీరు తదితర అంశాలపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేయాల్సిన తీరును వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ప్రసాద్, అన్వేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వికాస ఎన్నికలకు నామినేషన్లు దాఖలు

ఏఎన్‌యూ: విశ్వవిద్యాలయ ఉద్యోగ సంఘం (వికాస) ఎన్నికలకు బుధవారం నామినేషన్లు దాఖలు అయ్యాయని ఎన్నికల అధికారి ప్రొఫెసర్ ఎస్.మురళీ మోహన్ తెలిపారు. ఉద్యోగులు ఫ్రెండ్స్ ప్యానెల్‌గా ఏర్పడి నామినేషన్ వేశారు. **ఫ్రెండ్స్ ప్యానెల్ అభ్యర్థులు:** ఎన్.ప్రసాద్ (అధ్యక్షులు), డి.విజయ ప్రకాష్‌బాబు (ఉపాధ్యక్షులు), జె. శ్రీనివాసరావు (కార్యదర్శి), టి.వెంకటేష్, ఎన్.నాగేశ్వరరావులు (సంయుక్త కార్యదర్శులు), కె.యేషయ్య, (కోశాధికారి) **ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా అభ్యర్థులు:** జి.శ్రీను, కె.శశిధర్, పి.నాగరాజు, ఎన్.వెంకటేశ్వరరావు, ఇ.శ్రీనివాసరెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వరరావు, సీహెచ్.సాంబశివరావు, సీహెచ్.ఆనంద్‌లు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి ప్రొఫెసర్ ఎస్.మురళీ మోహన్ తెలిపారు.

వ్యక్తిగత సెలవులపై పరిమితి విధించడం సరికాదు

బాపట్ల టౌన్: వ్యక్తిగత సెలవులపై పరిమితి విధించడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య చైర్మన్ బడుగు శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల సెలవులపై విద్యాశాఖ అధికారులు ఉన్న స్టాఫ్ లో 7% నుంచి 10% మాత్రమే వాడుకోవాలని షరతులు విధించడం బాధాకరమని ఖండించారు. అత్యవసర, ఆరోగ్య కారణాలతో సాధారణ సెలవులు (సీఎల్ఎస్), ప్రత్యేక సాధారణ సెలవులు (ఎస్‌సీఎల్ఎస్) వినియోగించుకోవడంపై ఆంక్షలు విధించడం సరికాదని తెలిపారు. సకాలంలో సిలబస్ పూర్తి చేస్తూ అపార్ నమోదులో తీవ్ర ఒత్తిడికి గురవుతున్న ఉపాధ్యాయులపై ఆంక్షలు విధిస్తూ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని ఆయన ఆరోపించారు. ఉపాధ్యాయులు యాప్‌ల నిర్వహణ తోపాటు 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూనే ఉన్నారన తెలిపారు. అత్యవసర, అనారోగ్య సమస్యలప్పుడు అర్హత గల సెలవులు వాడుకోవడానికి అధికారులు ఆంక్షలు విధించకుండా ఆదేశాలు ఇవ్వాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను శ్రీనివాస్ కోరారు. సమావేశంలో జనరల్ సెక్రటరీ సీహెచ్. టి.వి. సురేష్, ట్రెజరర్ డి. ప్రసాదరావు, డెప్యూటీ సెక్రటరీ జె. వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన అవసరం

నరసరావుపేట ఈస్ట్: హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ మురళీకృష్ణ తెలిపారు. వరల్డ్ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో స్టాల్లు ఏర్పాటు చేశారు. వీటిని ప్రారంభించిన డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఈ స్టాల్స్ రెండురోజుల పాటు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలో సమగ్ర సలహా, పరీక్షలు, ఐసీటీసీ, గర్భిణులకు పీపీటీసీ కేంద్రాలు 9 అందుబాటులో ఉన్నాయన్నారు. వీటితోపాటు ప్రాథమిక, అర్బన్ ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆసుపత్రులలో ఉచితంగా హెచ్ఐవీ పరీక్షలు చేస్తారని తెలిపారు.

ఐఎంఏ జాతీయ ఉత్తమ కార్యదర్శిగా డాక్టర్ నరేంద్ర రెడ్డి



గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ ఉత్తమ కార్యదర్శిగా సీనియర్ జాయింట్ రిప్లేస్మెంట్ సర్జన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి ఎంపికయ్యారు. 2023–2024 సంవత్సరానికి గుంటూరు బ్రాంచ్‌ను జాతీయస్థాయిలో పలు విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచేలా తీర్చిదిద్దినందుకు డాక్టర్ బూసిరెడ్డిని ఈ అవార్డు వరించింది. ఈ మేరకు బుధవారం ఢిల్లీలోని ఐఎంఏ ప్రధాన కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయి. వచ్చేనెల డిసెంబర్ 27న హైదరాబాద్‌లో జరగనున్న ఐఎంఏ జాతీయ సమావేశాల్లో డాక్టర్ నరేంద్రరెడ్డికి ఈ అవార్డును అందజేయనున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా డాక్టర్ బూసిరెడ్డి అనేక కార్యక్రమాలు చేపట్టి గుంటూరు బ్రాంచ్‌కు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారు. గుంటూరు బ్రాంచ్ చరిత్రలో నిలిచిపోయేలా విజయవాడ వరదల సమయంలో ఆపన్నులను ఆదుకునేందుకు సుమారు రూ. 15 లక్షలకుపైగా వైద్యుల నుంచి సేకరించి రాష్ట్ర శాఖ ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశారు. వరదల కారణంగా బురదమయమైన గృహాలను శుభ్రపరిచేందుకు 50కిపైగా హై ప్రెజర్ పంపులను సేకరించి అగ్నిమాపక శాఖకు అందజేశారు. ఈ విషయమై జాతీయ స్థాయి నుంచి ప్రశంసలు అందాయి. అలాగే డాక్టర్స్ దివాళి సెలబ్రేషన్స్, ఇఫ్తార్ విందు, ఆర్ జి కర్ నిరసన కార్యక్రమాలను తనదైన శైలిలో నిర్వహించి గుంటూరు బ్రాంచ్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చారు. ఉత్తమ కార్యదర్శిగా ఎంపికైన డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డిని ఐఎంఏ రాష్ట్ర, స్థానిక నాయకులు, పలువురు వైద్యులు, అభినందించారు.

నేడు డాక్టర్ యశోధరకు అంతర్జాతీయ అవార్డు



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ యశోధర పువ్వాడకు కెనడా దేశానికి చెందిన సంఘ సేవకురాలు షారోన్ పేరిట ఏటా ఇస్తున్న అంతర్జాతీయ స్మారక అవార్డు–2024ను గురువారం ప్రదానం చేస్తారు. స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ పెన్నీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో బుర్రిపాలెం రోడ్డులోని 'ఎస్' భవనంలో మధ్యాహ్నం మూడు గంటలకు ఏర్పాటయే ప్రత్యేక సభలో డాక్టర్ యశోధరకు ఈ అవార్డును బహూకరించనున్నట్టు సంస్థ డైరెక్టర్ ప్రదీప్ దోనేపూడి తెలిపారు. వివిధ రంగాల ప్రముఖులు అతిథులుగా హాజరవుతారని చెప్పారు. డాక్టర్ యశోధర పువ్వాడ వైద్యశాస్త్రంలో మాస్టర్ డిగ్రీ అందుకున్నారు. పట్టణంలో సొంతంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. 'స్కిన్–ఇన్' హాస్పటల్ ఎండీగా మానవ శరీరంలో ప్రాముఖ్యం చర్మవ్యాధుల రుగ్మతలపై చికిత్స చేస్తున్నారు. బొల్లి, కుష్ఠు వ్యాధుల నివారణలోని కృషిచేస్తూ, చర్మవ్యాధుల నిపుణురాలిగా తెచ్చుకున్నారు. లైంగికంగా సంక్రమించే వ్యాధుల నివారణలోనూ పేరుతెచ్చుకున్నారు. పెన్నీ మినిస్ట్రీస్ సంస్థ రెండు దశాబ్దాలుగా కుష్ఠు రోగులు, హెచ్ఐవీ పీడితులకు, వితంతువులకు ఆరోగ్య, ఆహార సేవలను అందిస్తోంది. ఆరోగ్య సేవలకు డాక్టర్ యశోధర స్వచ్ఛందంగా తోడ్పడుతున్నారని ప్రదీప్ వెల్లడించారు. ఆమె సేవలకు గుర్తింపుగా షారోన్ అవార్డును అందజేస్తున్నట్టు తెలిపారు. గతేడాది ఇదే అవార్డును డీ3 శారద సర్వీసెస్ సొసైటీ వ్యవస్థాపకురాలు, ప్రముఖ సంఘసేవకులు డాక్టర్ డి.శారదకు అందజేశారు.